క్లుప్తంగా

అన్నదానానికి విరాళం

పాలకొండ: కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేపట్టనున్న అన్నదానానికి పట్టణానికి చెందిన కర్నేన అప్పలనాయుడు, యోగిత దంపతులు రూ. 10వేల నగదు, 15 బస్తాల బియ్యం అందించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులకు సోమవారం వీటిని అందజేశారు. నవరాత్రుల్లో ఒక రోజు వీరి పేరిట అన్నదానం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పరామర్శ



జయరాం, సంజీవులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ : పట్టణంలోని కస్పావీధికి చెందిన కంట జయరాం, సంజీవులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. ఇటీవల వీరి తల్లి బూరాడ బాలథెరీసా అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించరు. ఆయనతో పాటు నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, బాసూరు కాంతారావు, తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్.ప్రశాంత్‌కుమార్, ఎస్సై

జియ్యమ్మవలస: మండల ఎస్సైగా ఎస్.ప్రశాంత్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని అన్నారు. ప్రజలతో మమేకమై మండలాన్ని శాంతియుతంగా ఉంచేందుకు కృషిచేస్తానన్నారు.

సీతంపేట ఎస్సైగా..

సీతంపేట: మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా వై. అమ్మన్నరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై జగదీష్‌నాయుడుకు సాలూరు బదిలీ జరిగింది. బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్సైని సిబ్బంది అభినందించారు.

గ్రామాల్లో గ్రామసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ తులసీదాస్

భామిని: ఎస్ఆర్ఈజీఎస్ పనులు నిర్వహించేందుకు గాను గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, పనులను ఎంపిక చేయాలని ఉపాధి ఏపీఓ ఈ. తులసీదాస్, ఈసీ రమణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన ఉపాధి పనులు గుర్తించాలని సూచించారు.

జిల్లేడు ద్రావణంతో చీడపీడల నివారణ

- ఏఓ సింహాచలం



జిల్లేడు ద్రావణం తయారీ చేసి చూపిస్తున్న ఎన్‌పీఎం సిబ్బంది

భామిని: జిల్లేడు ద్రావణంతో చీడపీడలను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి కె. సింహాచలం అన్నారు. మండలంలోని పసుకుడిలో ఎన్‌పీఎం సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనీ అంబోజీ, ఐసీఆర్పీ వలరౌతు ప్రభాకరరావు, సీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

రుచి కోసం వాడితే.. రోగాలు ఖాయం

- ఫాస్ట్‌ఫుడ్స్‌లో విరివిగా చైనా సాల్ట్ వినియోగం
- వాటిని తింటే ఆరోగ్యానికి హానికరం



టేస్టింగ్ సాల్ట్‌గా పిలిచే అజినోమోటో

భామిని: హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, విందు భోజనాల్లో రుచి కోసం అజినో మోటో అనే టేస్టింగ్ సాల్ట్‌ని వినియోగిస్తుంటారు. దీన్ని చైనా సాల్ట్ అని కూడా అంటారు. విందు భోజనాల తయారీలో వంట మాస్టర్ రాసే లిస్ట్‌లో ఇది తప్పకుండా ఉంటుంది. దీనితో వండిన వంటకాలను లొట్టలేసుకుని తింటే ఆరోగ్యం పాడవుతుందని ఫుడ్ అండ్ డ్రగ్ కంట్రోల్ అధికారులు చెపుతున్నారు. ఇందులోని రసాయనాలు కడుపునొప్పి, అజీర్తి, ఇతర ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయని అంటున్నారు. వంటకాల్లో దీని వినియోగం పూర్తిగా తగ్గించాలని సూచిస్తున్నారు.

టేస్టింగ్ సాల్ట్‌తో కలిగే నష్టాలు

- ప్రస్తుతం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లులోనే కాదు, ఫంక్షన్లలో కూడా చైనాసాల్ట్ వినియోగం పెరిగిపోయింది.
- దీంతో చేసిన ఆహార పదార్థాలను తింటే శరీరం రోగాల గంపగా మారుతుంది.
- ఇది ఆహారంతో శరీరంలోకి చేరి చెదల వలే పేగులను కొరికేస్తుంది.
- ఈ చైనా సాల్ట్‌తో తయారు చేసిన తినుబండారాలను 40 రోజులపాటు ఆరగిస్తే బీపీ, సుగర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- నాలుకపై ఉన్న రుచి మొగ్గలను నశింప చేస్తుంది. దీని వల్ల నాలుక రుచురు గుర్తించే శక్తిని కోల్పోతుంది.
- దీని ప్రభావం మెదడు పనితీరుపై కూడా చూపుతుంది. మెదడు మొద్దుబారిపోయి క్రమంగా జ్ఞాపకశక్తి కోల్పోతుంది.
- దీర్ఘకాలం పాటు చైనాసాల్ట్‌ను వాడితే పక్షవాతం, హార్ట్ అటాక్, ఉబకాయం వచ్చే ప్రమాదం ఉంది.

రుచి కోసం వాడొద్దు



టేస్టింగ్ సాల్ట్‌గా పిలిచే అజినోమోటోను రుచి కోసం అన్ని వంటల్లో వాడేస్తున్నారు. ఇది నిషేధించిన పదార్థం. దీన్ని చైనా నుంచి ఫెర్టిలైజర్ పేరుతో దిగుమతి చేసి వంటల్లో రుచి కోసం వాడుతున్నారు. ఆ పదార్థాలను తినడం ద్వారా అనేక రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అజినోమోటో వినియోగించిన ఆహార పదార్థాలను తిని ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు.

– డాక్టర్ కె.విజయపార్వతీ, డీఎంహెచ్ఓ, పార్వతీపురం మన్యం జిల్లా

తాగునీటి సమస్య పరిష్కరించరూ..



పంచాయతీ ఈఓ రవికి తాగునీటి సమస్యను వివరిస్తున్న కస్పావీధి వాసులు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీ కస్పావీధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు ఈఓ ఎం. రవిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో సుమారు వంద కుటుంబాలుంటే, కేవలం రెండు కుళాయి పాయింట్లు మాత్రమే ఉన్నాయన్నారు. దీంతో ప్రతిరోజూ నీరు పట్టే సమయంలో తగాదాలో చోటుచేసుకుంటున్నాయని, అధికారులు స్పందించి కుళాయి పాయింట్లను పెంచాలని కోరారు.

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలి



మిషన్ సాక్ష్యం అంగన్‌వాడీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో పోషకాహార సవాళ్లను పరిష్కరించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న మిషన్ సాక్ష్యం అంగన్‌వాడీ, పోషణ్ 2.0ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ఆరేళ్లలోపు చిన్నారులకు మెరుగైన పోషకాహారం అందించడంతో పాటు మానసిక స్థితిని, శారీరక స్థితి, సామాజిక అభివృద్ధికి తగిన ప్రోత్సాహం అందివ్వాలని, అలాగే గర్భిణులు, బాలింతలకు రక్తహీనత కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో భద్రగిరి సీడీపీఓ సీహెచ్ సుశీలదేవి, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైస్ సర్పంచ్ కిషోర్, సూపర్‌వైజర్ శ్రీదేవి, కార్యకర్తలతో పాటు టీఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లోవరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఉద్రేకాలను అదుపుచేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: యుక్తవయస్సులో వచ్చే మానసిక ఉద్రేకాలను అదుపుచేసుకుని, లక్ష్యం దిశగా అడుగులు వేయాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. భద్రగిరి సీహెచ్‌సీ అడాలసిస్ హెల్త్ కౌన్సిలర్ ప్రమీల సోమవారం కళాశాలలో కౌమార విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ కౌన్సిలర్ ప్రమీల మాట్లాడుతూ కౌమార దశ నుంచి యుక్త వయస్సుకు వెళ్తున్న విద్యార్థులు లింగ భేదం లేకుండా శారీరక మానసిక సమస్యలను తెలివిగా ఎదుర్కొని ఎవరికీ ఇబ్బంది లేకుండా మెలగాలన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యుక్తవయస్సులోకి వస్తున్న నేపథ్యంలో కొన్ని విషయాల్లో ఆకర్షితులవ్వడం సహజమేనని, అయితే వాటిని అదుపులో ఉంచుకుని చదువు పట్ల దృష్టి సారిస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ శ్రీవాణి, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



ఉత్తమ కబడ్డీ క్రీడాకారులతో కొండబాబు, తదితరులు

పాలకొండ రూరల్: మండల పరిధిలోని క్రీడాకారులను ప్రోత్సహిస్తామని సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, మాజీ కౌన్సిలర్ పల్లా కొండబాబు అన్నారు. ఉత్తమ కబడ్డీ క్రీడాకారులకు క్రీడా కిట్లు, ప్రత్యేక యూనిఫారాలను సోమవారం అందజేశారు. నగర పంచాయతీ పరిధి ఎన్‌కే రాజపురంనకు చెందిన ఉర్లంకుల సూర్యారావు జ్ఞాపకార్థం కబడ్డీ దుస్తులను ప్రత్యేకంగా అందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు రామినాయుడు, సూరిబాబు, రమేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భామిని: కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షుడు ఎస్.మణి సూచనల మేరకు పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో మండలంలో న్యాయ సహాయం అందించడానికి స్వచ్ఛందంగా పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల స్థానిక విద్యావంతులు అక్టోబర్ 5లోగా కొత్తూరు న్యాయ సేవాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందివ్వాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కురుపాం ప్రభుత్వ మద్యం దుకాణం ఎదుట మహిళా సంఘాల మద్దతులో నిరశన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాలసీ అనే నిర్ణయం తీసుకొచ్చినందున రాష్ట్రంలో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సుమారు 15 వేల మందికి ఉపాధి లేకుండా పోతోందన్నారు. కావున వారందరికీ కనీసం అవుట్ సోర్సింగ్ విధానంలోనైనా ఏదైన ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని కోరారు.

ఈ-పంట నమోదు పరిశీలన



ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని కాశీపేటలో ఈ-పంట నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ-పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ-పంట నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఇందుకోసం రైతు సేవా కేంద్రంలో ఉన్న వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

ఎస్ఈబీ సీఐగా పద్మావతి

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం ఎస్ఈబీ సీఐగా డి.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఇక్కడ సీఐగా సేవలందించిన శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో పార్వతీపురం ఎస్ఈబీలో ఎస్ఐగా పనిచేసిన డి.పద్మావతి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నతాధికారుల సూచలతో విధులు నిర్వహిస్తానని, సర్కిల్ పరిధిలోని ప్రజలు సహకరించాలని కోరారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తాం..

పార్వతీపురంటౌన్: అందరి సహకారంతో పార్వతీపురం మున్సిపాలిటీని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి అధ్యక్షతన సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి కౌన్సిలర్లు తీసుకొచ్చారు. అన్ని అభివృద్ధి పనులు దశలవారీగా చేపడుతామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్ ప్రారంభం



అర్బన్ మార్కెట్ ప్రారంభిస్తున్న మెప్మా సిబ్బంది

పాలకొండ : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను సోమవారం ప్రారంభించారు. కోటదుర్గమ్మ ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఈ మార్కెట్‌లో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు చర్యలు తీసుకున్నామని మెప్మా సీఎంఎం కృష్ణారావు తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు సొంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గంటా సంతోష్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి



రోగిని పరీక్షిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. వివిధ రోగాలతో బాధపడుతున్న వారు ప్రతిరోజూ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు. సోమవారం వందలాది మంది రావడంతో సిబ్బంది వైద్యసేవలందించారు. వైరల్ జ్వరాలతో ఎక్కువ మంది వస్తున్నారని ఆస్పత్రి సూపరింటిండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం పునఃప్రారంభం



ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పునఃప్రారంభిస్తున్న సర్పంచ్ కళావతి

సీతంపేట: గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాన్ని సర్పంచ్ ఎ.కళావతి సోమవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలంతా తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, కార్యదర్శి సుదర్శనరావు ,తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి..



మాట్లాడుతున్న ఎన్‌వీ రమణ

పాలకొండ: మహిళలకు అందించిన శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ అన్నారు. సోమవారం స్థానిక సత్యసాయి మందిరంలో నెల రోజులుగా మహిళలకు ఇస్తున్న కుట్టు శిక్షణ ఆదివారంతో పూర్తయింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, శిక్షణ కాలంలో నేర్చుకున్న విద్యతో ఇంటి వద్దనే ఉంటూ సంపాదన పెంచుకోవాలని సూచించారు. బాబా చెప్పిన మార్గంలో నడుచుకుని సమాజంలో మంచి పేరు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ సుధాకర్, టి. సూర్యాచారి, ఎస్. వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించాలి



శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి కె.ప్రకాష్

గరుగుబిల్లి: భవిష్యత్ కోసం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరింపజేయాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి కె.ప్రకాష్, పి.దేవుళ్లు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ సహకారంతో, రైతు సాధికార సంస్థ నిర్వహణతో ఫార్మర్ సైంటిస్ట్ కోర్సు నిర్వహణకు సంబంధించి నాలుగు రోజులుగా జట్టు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 87మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, ఆరోగ్యకరమైన ఉత్పత్తుల తయారీ, తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం వారికి క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకువెళ్లారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ బి.పారినాయుడు, జి.హేమసుందర్, డీపీఎం పి.షణ్ముఖరాజు, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

గ్రామసభల్లో పనులు గుర్తించాలి



మాట్లాడుతున్న ఏపీఓ గౌరీనాథ్

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకానికి సంబంధించి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి పనులను ఎంపిక చేయాలని ఏపీఓ ఎం.గౌరీనాథ్ క్షేత్రసహాయకులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్టోబర్ 2న గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారు చేయాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భువనమోహనరావు



శివ్వాంలో ఎస్‌డబ్ల్యూపీసీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: చెత్తనుంచి సంపద తయారు చేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని శివ్వాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీసీ) సోమవారం ఆమె ప్రారంభించారు. సాలిడ్ వెస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ ద్వారా వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు. అక్టోబర్ 2 నాటికి ఈ కేంద్రాల్లో కంపోస్టు ఉత్పత్తి ప్రారంభమయ్యేలా చర్యలు చపట్టినట్లు చెప్పారు. వర్మీ కంపోస్టు ఎరువుతో నాణ్యమైన ఆహార ఉత్పత్తులను ఉత్పత్తి చేసేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ యూనిట్ల అవశ్యకతను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ గోపాలరావు, సచివాలయ సిబ్బంది, తదితరులున్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మాజీ ఎంపీటీసీ బాబూ భువనమోహనరావు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. గతంలో ప్రారంభించినప్పటికీ వాడకపోవడంతో ప్రస్తుతం దాన్ని పునఃప్రారంభించారు. గ్రామంలో ఉన్న చెత్తను తీసుకొవచ్చి దాన్ని కంపోస్టుగా మార్చి పంచాయతీకి ఆదాయం సృష్టించడమే లక్ష్యంగా ఈ షెడ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మొండెంఖల్లు, కొండబారిడి గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చెత్త సంపద కేంద్రాలను సోమవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు మాట్లాడుతూ గ్రామంలోని చెత్తను ప్రతీ రోజు సేకరించి ఈ కేంద్రాలకు తరలించడం ద్వారా గ్రామాలు స్వచ్ఛంగా ఉంటాయన్నారు. గ్రామంలో సేకరించిన వ్యర్థాలతో రైతులకు అవసరమైన కంపోస్టు ఎరువు తయారు చేసి సంపద సృష్టించేందుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటనాయుడు, మిన్నారావు ఉన్నారు.

పాలకొండలో వర్షం

పాలకొండ రూరల్:

అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా అకాల వర్షం కురిసింది. ఉన్నట్లుండి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మబ్బులు కమ్ముకోవటంతో పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వరి కీలక దశలో ఉన్న సమయంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

– భారీ వర్షం..

భామిని: మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఎండలతో విలవిల్లాడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో సేదదీరారు. మెట్టు పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



భామిని: నేరడిలో కురుస్తున్న భారీ వర్షం



పాలకొండ రూరల్: ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో కురుస్తున్న వర్షం

కమ్మేసిన మేఘాలు..

వీరఘట్టం: నగరంలో వాతావరణం వేసవిని తలపిస్తోంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో వీరఘట్టం పట్టణంపై దుప్పటి పరిచినట్టైంది. అనంతరం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రజలంతా ఎంతో ఉపశమనం పొందారు.



వీరఘట్టం: వీరఘట్టాన్ని కమ్మేసిన అందమైన మేఘాలు